మేడం.. పింఛన్ రావడం లేదు

నర్సాపూర్ పోస్ట్ ఆఫీస్ వద్ద ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ముందు ఆవేదన వ్యక్తం చేస్తున్న వృద్ధులు

నర్సాపూర్, జూన్ 25 : పింఛన్ రావడం లేదని పలువురు వృద్ధులు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డితో తమ గోడును వెల్లబోసుకున్నారు. మంగళవారం నర్సాపూర్ పోస్ట్ ఆఫీస్ ముందు పడిగాపులు కాస్తున్న వృద్ధులను ఎమ్మెల్యే కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. చాలా రోజుల నుంచి పింఛన్ రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పింఛన్ వచ్చేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆమె వెంట మున్సిపల్ వైస్‌చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సత్యంగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు షేక్ హుస్సేన్, జ్ఞానేశ్వర్ తదితరులు ఉన్నారు.

నిధులు మంజూరు చేయించాలి

నర్సాపూర్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగులు మంగళవారం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని కలిసి పెన్షనర్ల భవన నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు చేయించాలని వినతిపత్రం అందజేశారు. గతేడాది మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి రూ.7లక్షలు మంజూరు చేశారని, దానితో స్లాబ్ వరకు నిర్మాణం జరిగిందని గుర్తు చేశారు. ఇంకో రూ.10 లక్షలు మంజూరు చేస్తే భవన నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబ సభ్యులకు పరామర్శ

నర్సాపూర్ మండల పరిధిలోని జక్కపల్లి మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఉద్యమకారుడు దుప్తల శ్రీనివాస్ సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మంగళవారం ఆయన సతీమణి వెంకటలక్ష్మితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ధరణి పెండింగ్ సమస్యలు పరిష్కరిస్తాం

■ కలెక్టర్ రాహుల్‌రాజ్ ■ ఆకస్మికంగా తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

ప్రభుత్వ దవాఖానలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

రేగోడ్, జూన్ 25 : ధరణి పెండింగ్ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం ఆకస్మికంగా తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. దరఖాస్తులపై తహసీల్దార్ బాలలక్ష్మి, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలో 10 దరఖాస్తులు మాత్రమే ధరణి సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ దరఖాస్తుల్లో వంద దరఖాస్తుల వివరాలు ఆర్డీవోకు పంపారు. ఇంకా 10 దరఖాస్తుల వివరాలను ఈ నెలాఖరు వరకు పంపగానే సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కస్తూర్బా విద్యాలయాన్ని కలెక్టర్ సందర్శించి హాస్టల్‌లో కూరగాయల నాణ్యత, వంటలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ప్రత్యేక అధికారి స్వయంప్రభకు సూచించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ దవాఖానను సందర్శించారు. సిబ్బంది హాజరు పట్టిక, ఓపీ, మందుల రికార్డులను పరిశీలించారు. దవాఖానలో ప్రసవించిన బాలింతకు వద్దకు వెళ్లి తల్లీబిడ్డల ఆరోగ్య వివరాలు అడిగి, సమయానికి భోజనం, మందులు ఇస్తున్నారా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ సుష్మ, మురళీకమల్, ఆర్ఐ ఫిరోజ్ ఉన్నారు.

విద్యారంగంపై చిత్తశుద్ధిలేని ప్రభుత్వం

మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

రామాయంపేట, జూన్ 25 : విద్యారంగంపై కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదని అఖిలభారత విద్యార్థి పరిషత్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు శశికాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోయిందని ఇష్టారీతిగా ఫీజులను పెంచుతూ అమాయక ప్రజలను నిండా ముంచుతున్నారన్నారు. ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ నేడు రామాయంపేటలో విద్యాసంస్థలకు బంద్ పిలుపునిచ్చామన్నారు. ఈ బంద్‌ను ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో శివ, సంపత్ సాయి ఉన్నారు.

నేడు ఏబీవీపీ ఆధ్వర్యంలో..

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 25 : నేడు జిల్లా వ్యాప్తంగా పాఠశాలల బంద్‌కు ఏబీవీపీ నాయకుడు భాను మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు.

మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన

మాట్లాడుతున్న ఏఎస్సై జైపాల్‌రెడ్డి

నిజాంపేట, జూన్ 25 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఏఎస్సై జైపాల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. గంజాయి, పాన్, గుట్కా తదితర మత్తు పదార్థాల జోలికి వెళ్లరాదన్నారు. అనంతరం పాఠశాల హెచ్ఎం జ్ఞాలమాల అధ్వర్యంలో మాదకద్రవ్యాల నియంత్రణ అంశంపై విద్యార్థులకు రాత పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం జ్ఞాలమాల, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

చిన్నశంకరంపేట, జూన్ 25 : చిన్నశంకరంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు సమాజంపై డ్రగ్ ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ వ్యాసరచన పోటీల్లో వనజ, పూజా, దివ్య, తమ ప్రతిభను కనబరిచి విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగేందర్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రమ్‌సీడర్‌తో తగ్గనున్న లాగోడి ఖర్చులు

వెల్దుర్తిలో డ్రమ్‌సీడర్ ద్వారా వరినాటును పరిశీలిస్తున్న ఏవో ఝాన్సీ, ఏఈవో వందన

వెల్దుర్తి, జూన్ 25 : డ్రమ్‌సీడర్, వెదజల్లే పద్ధతిలో వరినాటు వేసుకొంటే లాగోడి ఖర్చు తగ్గడంతో పాటు కూలీల కొరతను అధిగమించవచ్చని వెల్దుర్తి మండల వ్యవసాయ అధికారి ఝాన్సీ అన్నారు. మంగళవారం వెల్దుర్తి పట్టణానికి చెందిన రైతు తోటనర్సింహులు పొలంలో డ్రమ్‌సీడర్ ద్వారా వరి నాటుపై ఏఈవో వందన, పలువురు రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు.

అంగన్‌వాడీల్లో పూర్వ ప్రాథమిక విద్య

■ జూలై మొదటి వారంలో అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ
■ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, జిల్లా అధికారులు

మెదక్, జూన్ 25 (నమస్తే తెలంగాణ) : అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళ శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ అన్నారు. మంగళవారం అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధిపై రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సెంటర్ల అభివృద్ధిపై స్వచ్ఛంద సంస్థల సహకారంతో కార్యచరణ, పిల్లల అభ్యున్నతిపై తీసుకోవాల్సిన చర్యల ప్రణాళిక రూపొందించామన్నారు. పిల్లలకు నేర్పించాల్సిన అంశాలను వివరిస్తూ అంగన్ వాడీ టీచర్లకు ప్రత్యేక బుక్ లెట్ రూపొందించామన్నారు. జూలై మొదటి వారం నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్యపై శిక్షణ పూర్తి చేయాలని సూచించారు. ప్రతి కేంద్రంలో ప్లే మ్యాట్ ఏర్పాటు చేయాలన్నారు. దీనిని రాష్ట్ర స్థాయి నుంచి అందించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో సంక్షేమ శాఖ వద్ద అందుబాటులో ఉన్న నిధులతో ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా వా ల్ పేయింటింగ్స్ వేయించాలన్నారు.

జిల్లాస్థాయిలో కలెక్టర్ల పర్యవేక్షణ

జిల్లా స్థాయిలో కలెక్టర్లు అంగన్‌వాడీ శిక్షణ కార్యక్రమాలను పర్యవేక్షించాలని వాకాటి కరుణ సూచించారు. పిల్లలకు ఏక రూప దుస్తులు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు దివ్యాంగ సర్టిఫికెట్ త్వరితగతిన అందించేందుకు సదరం క్యాంపులలో అవసరమైన మేర స్లాట్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వృద్ధుల సంక్షేమం కోసం టోల్ ఫ్రీ నంబర్ 14567 ద్వారా జిల్లాలో ఎవరైనా వయోవృద్ధులు వారి పిల్లలు-సంతానం లేదా వారసులు సరిగ్గా చూసుకోనట్లయితే, వారికి అందించాల్సిన కనీస అవసరాలతో పాటు జీవించే హక్కును కాలరాయడం, దుర్భాషలాడడం భౌతిక హింస, శారీరక, మానసిక హింసలకు గురి చేస్తే వారిపై చట్ట రీత్యా చర్యలు జైలు శిక్ష, జరిమానా విధింనున్నట్లు ఆమె హెచ్చరించారు.

వివరాలు నమోదు చేసి..

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాలు, పట్టణాల్లో ఉన్న 1 నుంచి ఆరేండ్లలోపు పిల్లల వివరాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో రిజిస్టర్ చేయించి వారికి రెగ్యులర్‌గా పౌష్టికాహారం అందించాలని అన్నారు. అంగన్ వాడీ కేంద్రాల్లో ఉన్న పిల్లల ఎదుగుదల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, వయస్సుకు తగిన బరువు, ఎత్తు లేని పిల్లలను గుర్తించాలని, పిల్లలలో ఉన్న ఎదుగుదల, మానసిక సమస్యలను ముందస్తుగా గుర్తిస్తే వాటిని త్వరితగతిన పరిష్కరించే అవకాశం ఉంటుందని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా సంక్షేమ అధికారి బ్రహ్మాజీ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్

మెదక్, జూన్ 25 (నమస్తే తెలంగాణ): ఉద్యోగుల అన్ని రకాల సమస్యలు వెంటనే పరిష్కరించాలని అదే క్రమంలో మెదక్ జిల్లా అభివృద్ధిని కాంక్షించాలని టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక టీఎన్జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ.. ఉద్యోగులు గత మూడేండ్లుగా ఆర్థిక, ఆర్థికేతర తదితర అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటిని పరిష్కరించే బాధ్యత నూతన ప్రభుత్వంపై ఉందన్నారు. ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల సమయంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని పలు డిమాండ్లపై కార్యవర్గ సమావేశంలో తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదింప చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనురాధ, జిల్లా సహాధ్యక్షుడు ఇక్బాల్ పాషా, కోశాధికారి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు మనోహర్, ఫజులుద్దీన్, రఘునాథరావు, లీల, సంయుక్త కార్యదర్శులు చిరంజీవాచార్యులు, శివాజీ, రాధ, ఆర్గనైజింగ్ కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, క్రీడల కార్యదర్శి గోపాల్, కార్యవర్గ సభ్యులు దోమ మరియ, మెదక్, ఏడుపాయల వనదుర్గ, నర్సాపూర్, చేగుంట, రామాయంపేట యూనిట్ల అధ్యక్ష కార్యదర్శులు ఆరేళ్ల రామా గౌడ్, సూర్య శ్రీనివాస్, కె శేషాచారి, కె అశోక్ రెడ్డి, నిఖిల్ శ్రీనివాస్, నీటిపారుదల శాఖ ఫోరం కార్యదర్శి శ్రీ హర్ష, వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం జిల్లా కార్యదర్శి శేఖర్, సరస్వతి తదితరు ఉద్యోగులు పాల్గొన్నారు.

పాపన్నపేటలో భారీ దొంగతనం

■ దుకాణానికి కన్నం, సీసీ కెమరాలు ధ్వంసం
■ 12తులాల బంగారం, రెండు లక్షల నగదు అపహరణ

గోడకు కన్నం వేసిన దృశ్యాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పాపన్నపేట, జూన్ 25 : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో సోమవారం రాత్రి భారీ దొంగతనం జరిగింది. ఆగంతకులు కిరాణం దుకాణానికి వెనుక నుంచి కన్నం వేసి సీసీ కెమెరాలు తొలిగించి సుమారు రూ.11లక్షల సొత్తును ఎత్తుకెళ్లారు. పోలీసులు డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీంతో దొంగలను పట్టుకునేందుకు పోలీసులు వేట ప్రారంభించారు. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాలు..పాపన్నపేటకు చెందిన కూకట్ల ప్రసాద్ రోజులాగే కిరాణం షాపును సోమవారం రాత్రి 10గంటలకు మూసివేసి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం 9గంటలకు షాపు తెరిచి చూసే సరికి కౌంటర్ వద్ద సామాను చెల్లా చెదురుగా పడి ఉంది. వెనుక నుంచి గోడకు కన్నం వేసినట్లు గుర్తించి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగలు గడ్డపారతో గోడకు కన్నం వేశారు. అక్కడ ఉన్న సీసీ కెమెరాను ధ్వంసం చేశారు. అనంతరం లోపలికి ప్రవేశించి కౌంటర్‌లో ఉన్న రూ.2లక్షల నగదు, 12 తులాల బంగారు ఆభరణాలు, 116 వెండి సిక్కాలతో పాటు టీవీ, సీసీ కెమెరాను ఎత్తుకెళ్లారు. దుండగుల గాలింపు కోసం పోలీస్ డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం ఘటనా స్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వాహనాలు దొంగిలించిన నిందితుడి రిమాండ్

నిందితుడితో పాటు స్వాధీనం చేసుకున్న వాహనాలతో దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్సై గంగారాజు పోలీసు సిబ్బంది

దుబ్బాక,జూన్ 25: ద్విచక్ర వాహనాలు దొంగిలిస్తున్న ఓ దొంగను దుబ్బాక పోలీసులు చాకచక్యంగా పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం దుబ్బాక సర్కిల్ కార్యాలయంలో సీఐ శ్రీనివాస్ విలేకరులకు వివరించారు. ఈ నెల 21న దుబ్బాక మండలం చీకోడులోని సాయి సమర్థ ఆశ్రమం వద్దకు వచ్చిన ఓ భక్తుడి ద్విచక్ర వాహనం దొంగతనానికి గురైంది. బాధితుడు దుబ్బాక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన దుబ్బాక పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా బైక్ దొంగతనం చేసిన నిందితుడు రామక్కపేట గ్రామానికి చెందిన శ్రీకాంత్‌గా గుర్తించారు. నిందితుడిని విచారించగా దుబ్బాక, సిద్దిపేట ప్రాంతాల్లో ఆరు ద్వి చక్ర వాహనాలు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. గతంలో శ్రీకాంత్ దుబ్బాక, భూంపల్లి పోలీసుస్టేషన్ల పరిధిలో సెంట్రింగ్ డబ్బాలతో పాటు పలు కిరాణా దుకాణాల్లో దొంగతనానికి పాల్పడినట్లు వివరించారు. నిందితుడు శ్రీకాంత్ నుంచి ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని అతన్ని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ద్విచక్ర వాహనాల దొంగతనం కేసును ఛేదించినందుకు దుబ్బాక ఎస్సై గంగరాజుతో పాటు పోలీసు సిబ్బందిని సీఐ ప్రత్యేకంగా అభినందించారు.

లింక్ ఓపెన్.. రూ.83వేలు కోల్పోయిన యువకుడు

చేర్యాల, జూన్ 25 : మండలంలోని ముస్త్యాల గ్రామానికి చెందిన ఓ యువకుడు తన స్నేహితుడు పంపించినట్లుగా వచ్చిన ఓ లింక్‌ను ఓపెన్ చేయడంతో రూ.83 వేలు కోల్పోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.గ్రామానికి చెందిన ఓ యువకుడు తన సెల్ ఫోన్‌కు వాట్సాప్‌లో పీఎం కిసాన్ ఏపీకే యాప్ స్నేహితుడి మొబైల్ వాట్సాప్ ద్వారా రావడంతో దానిని ఓపెన్ చేయడంతో రూ.83వేలు ఖాతాలో నుంచి సైబర్ నేరగాళ్లు కొట్టివేశారు. గమనించిన సదరు యువకుడు సైబర్‌క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

హనుమాన్ ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు

పెద్దశంకరంపేట, జూన్ 25 : అంగారక సంకట చతుర్థిని పురస్కరించుకొని పెద్దశంకరంపేట పట్టణంలోని తిర్మలాపురం హనుమాన్ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో గణపతి విగ్రహానికి అభిషేకం చేశారు. అనంతరం హోమం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం

చిన్నారులకు అక్షరాభ్యాసం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

చిన్నశంకరంపేట, జూన్ 25 : మండల కేంద్రంలోని రెండో అంగన్‌వా డీ కేంద్రంలో మంగళవారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రోత్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లల ఎదుగుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తల్లులకు వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివకుమారి, ఏఎన్ఎం నాగలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు నాగమణి, మాలతి, నాగజ్యోతి రాణి, ఆశా వర్కర్లు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

మరుగుదొడ్ల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీవో, ఏపీవో, ఈవోలు

వెల్దుర్తి, జూన్ 25 : మండల కేంద్రంలోని కమ్యూనిటీ మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.2లక్షల నిధులు మంజూరయ్యాయని ఇన్‌చార్జ్ ఎంపీడీవో విఘ్నేశ్వర్ తెలిపారు. మంగళవారం మరుగుదొడ్ల నిర్మాణాల కోసం ఏపీవో రాజు, పంచాయతీ ఈవో బలరాంరెడ్డిలతో కలిసి వెల్దుర్తి బస్టాండ్ చౌరస్తా వద్ద స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురుషులు, మహిళలకు ప్రత్యేకంగా మరుగుదొడ్ల నిర్మాణాల కోసం గతంలో ప్రతిపాదనలు పంపించగా, ప్రభుత్వ రూ.2 లక్షలు మంజూరు చేసిందని తెలిపారు. త్వరలోనే మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

ఎరువుల దుకాణం తనిఖీ

ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయధికారి గోవింద్

కౌడిపల్లి, జూన్ 25 : మండల పరిధిలోని బుజిరంపేటలో ఉన్న ఎరువుల దుకాణాన్ని మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు యూరియా కొనుగోలు సమయంలో ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. షాపు లైసెన్స్ రెన్యూవల్ చేయించుకోవడంతో పాటు రోజువారీగా రైతులకు విక్రయించే మందుల స్టాక్ రిజిస్టర్ అప్‌డేట్ చేయాలన్నారు. రైతులకు విక్రయించే మందుల వివరాలు ఖచ్చితంగా నోటీసు బోర్డు షాపు ముందు ఉంచాలన్నారు.

చీకోడులో రేషన్ బియ్యం పట్టివేత

దుబ్బాక,జూన్25: దుబ్బాక మండలం చీకోడులో సోమవారం అర్ధరాత్రి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా దుబ్బాక పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘనటకు సంబంధించిన వివరాలు మంగళవారం దుబ్బాక ఎస్సై గంగరాజు స్థానిక విలేకరులకు తెలిపారు. దుబ్బాక మండలం చీకోడు గ్రామానికి చెందిన యాదగిరి బొలేరో వాహనంలో సూమారు 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌కు తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి, పట్టుకున్న రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై గంగారాజు తెలిపారు.

బెజ్జంకి ఎంఈవోగా సత్తు యాదవరెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు ఎమ్మార్సీ కార్యాలయంలో సన్మానించారు. బెజ్జంకి, జూన్ 25

కల్యాణలక్ష్మి చెక్కులకు గడువు ముగిసే..

బెజ్జంకి, జూన్ 25: మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఇటీవల క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. వీటిలో కొంత మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల నిధులు మంజూరు కాగా మరికొన్ని బ్యాంకుల చెక్కులు వచ్చిన వారికి చెక్కుల గడువు ముగియడంతో నిధులు జమకాక చెక్కులు తిరిగి వచ్చాయి. లబ్ధిదారులు బ్యాంకులకు వెళ్లగా మీ చెక్కు గడువు ముగిసింది తేదీ మార్చుకొని రావాలని సూచించడంతో లబ్ధిదారులు డబ్బులు వస్తాయో రావో అని మనోవేదనకు గురువుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తేదీ మార్పు చేసి తిరిగి చెక్కులు అందించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

వాహనదారులు చలానాలు చెల్లించండి

మాట్లాడుతున్న ఆర్టీవో శ్రీనివాస రావు

రామాయంపేట, జూన్ 25 : వాహనదారులు పెండింగ్ చలానాలు, పన్నులను వెంటనే చెల్లించాలని మెదక్ ఆర్టీవో శ్రీనివాస రావు సూచించారు. మంగళవారం రామాయంపేటకు వచ్చిన ఆయన చలానా చెల్లించని ఓ ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. పెండింగ్ చలానాలు చెల్లించని వాహనదారులపై కేసులు నమోదు చేయడంతో వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్‌ను ధరించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన పత్రాలు తమ వెంట ఉండాలన్నారు.

బాలికపై శునకం దాడి

రామాయంపేట, జూన్ 25 : బాలికపై ఊరకుక్క దాడి చేసిన ఘటన రామాయంపేట పట్టణంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో జరిగింది. పట్టణంలోని కేసీఆర్ కాలనీ డబుల్‌బెడ్‌రూమ్‌కు చెందిన రామచంద్ర-రజిత కూతురు అర్పిత బాలికల పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నది. సోమవారం ఊరకుక్క ఒక్కసారిగా బాలికపై దాడి చేసి గాయపరిచింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ప్రభుత్వ దవాఖానలో చికిత్స చేయించారు.

ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కాపర్‌వైరు చోరీ

ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

చిన్నశంకరంపేట, జూన్ 25 : ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కాపర్ వైరును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన మండల పరిధిలోని గవ్వలపల్లి కొయ్యమరి గిరిజన తండాలో మంగళవారం జరిగింది. మండల పరిధిలోని గవ్వలపల్లి గిరిజన తండాలో వ్యవసాయ పొలాల వద్ద ఉన్న కరెంటు ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియిన వ్యక్తులు పగులగొట్టి అందులో ఉన్న కాపర్ వైరును దొంగిలించారు. విషయాన్ని గమనించిన రైతులు ఈ విషయమై చిన్నశంకరంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తక్షణమే రుణమాఫీ అమలు చేయాలి

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 25 : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన రుణమాఫీ హామీని తక్షణమే అమలు చేయాలని బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ మామిళ్ల అంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వర్షకాలం దృష్యా పెట్టుబడికి డబ్బు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రైతుల ఖాతాల్లో రైతు బంధు జమ చేయాలన్నారు. రైతులు ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులను రాయితీపై ఇవ్వాలన్నారు.

జోరుగా ఫీడర్ చానల్ పనులు

సుతారిపల్లిలో సాగుతున్న ఫీడర్ చానల్ పనులు

రామాయంపేట, జూన్ 25 : మండల పరిధిలోని సుతారిపల్లిలో ఫీడర్ చానల్ పనులు జోరుగా సాగుతున్నాయి. మంగళవారం గ్రామంలోని ఉపాధ